క్లుప్తంగా

కోదండరామ్‌పై బీఆర్‌ఎస్ కుట్రలు

కందుకూరు: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కోదండరామ్‌పై బీఆర్‌ఎస్ కుట్రలు చేయడం ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని మంటగలపడమేనని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ జేఏసీ చైర్మన్‌గా సమైక్యవాదుల కుట్రలను విచ్ఛిన్నం చేస్తూ సకలజనుల సమ్మె, సాగరహారం లాంటి ఆందోళనలతో ప్రత్యేక తెలంగాణ సాకారానికి కోదండరామ్ చూపిన తెగువ మరువలేనిదన్నారు. ఆయనను ప్రస్తుత ప్రభుత్వం ఎమ్మెల్సీగా ఎంపిక చేస్తే, బీఆర్‌ఎస్ మాత్రం ఆయనపై కుట్రలు, కుతంత్రాలు చేసి పరిపాలనలో భాగస్వామ్యం కాకుండా చేసిందని ఆరోపించారు. వారు చేసే కుట్రలను తెలంగాణ ప్రజలు హర్షించరని, భవిష్యత్‌లో తగిన బుద్ధి చెబుతారన్నారు.

ముగిసిన వార్షికోత్సవాలు

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ 42వ వార్షిక (కల్యాణం, బోనాల) వేడుకలు బుధవారం మూడో రోజుకు ముగిశాయి. ఈ వేడుకల సందర్భంగా అమ్మవారి కల్యాణం, అగ్ని గుండాలు, ఘటం ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు అమ్మవారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈట మోహన్‌రావు. మీగడ కాశీనాథ్, మురళీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాలువను పునరుద్ధరించాలి

మహేశ్వరం: మామిడిపల్లి గ్రామం నుంచి శంషాబాద్ వెళ్లే రూట్‌లో వర్షపునీరు సాఫీగా వెళ్లకుండా కబ్జాకు గురైన కాలువను పునరుద్ధరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజా ఏక్తా పార్టీ నాయకుడు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఈరంకి సందీప్‌గౌడ్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బుధవారం మామిడిపల్లి వివేకానంద చౌరస్తా నుంచి గ్రామంలోకి రాకపోకలు సాగించేందుకు వీలులేకుండా పైనుంచి వచ్చిన వరద రోడ్డుపైనే నిలిచిపోయిందన్నారు. ఏళ్ల తరబడి ఉన్న భారీ నాలాను ఇటీవల వెంచర్ల నిర్వాహకులు మూసేయ్యడంతోనే ఈ సమస్య తలెత్తిందన్నారు. భవిష్యత్తులో మరింత ముంపు సమస్య తలెత్తకుండా అధికారులు స్పందించి కాలువను పునరుద్ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వీధికుక్కలను నియంత్రించండి

కార్పొరేటర్ శ్రీవాణి



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: కాలనీల్లో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే నియంత్రించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కుక్కలు మనుషుల ప్రాణాలు తోడేస్తున్నాయని, ఎక్కువగా చిన్నారులే బాధితులు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో జింకలబావి కాలనీ, డాక్టర్స్ కాలనీల్లో చిన్నారులపై దాడులు చేయడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారన్నారు. పిల్లలు ఒంటరిగా కనిపిస్తే చాలు విచక్షణారహితంగా దాడులు చేసి ప్రాణాలు తీస్తున్న వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయాలని, షెల్టర్ హోమ్స్‌కు తరలించాలని కమిషనర్‌ను కోరినట్లు ఆమె తెలిపారు.

అనుమానాస్పదంగా యువతి ఆత్మహత్య

పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి తండ్రి

హస్తినాపురం: బీఈడీ చదువుతున్న గిరిజన యువతి అనుమానాస్పదంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా రఘునాథపల్లి మండలం బాబోడి తండాకు చెందిన బానోతు కలియ రెండో కుమార్తె అఖిల వనస్థలిపురంలో వెంకటరమణకాలనీలోని తన అక్క వాణి ఇంట్లో ఉంటోంది. ఈనెల 7న వాణి ఇంట్లో కిరాయి ఉండేవాళ్లు మీ చెల్లె అఖిల ఆత్మాహత్యాయత్నం చేసుకుందని వాణికి ఫోన్లో సమాచారం అందించారు. వాణి ఇంటికి వచ్చేలోగా ప్రియుడు రసూల్ అఖిలను ఆటోలో తీసుకెళ్తుండగా వాణి ఆటోను ఆపి నువ్వు ఎవరూ..? అని ప్రశ్నించగా రసూల్ పారిపోయాడు. వెంటనే వాణి ఆఖిలను హాస్పిటల్‌కు తీసుకెళ్లింది. అఖిల పరిస్థితి విషమంగా ఉందని ప్రియుడు రసూల్‌పై అనుమానం ఉందని తండ్రి బానోతు కలియ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రసూల్ లవ్ జిహాద్ పేరుతో తన కుమార్తెను ట్రాప్ చేసి హత్య ప్రయత్నం చేశాడని, కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ముంపు.. ముప్పు!

- చిరుజల్లుకు లోతట్టు ప్రాంతాలు జలమయం
- అసంపూర్తిగా బాక్స్ లైన్ పనులు.. తరచూ పొంగుతున్న
- ఆందోళనలో బస్తీవాసులు..
- పట్టించుకోని అధికారులు



బాపనగర్ శివాలయంలోకి చేరిన వరదనీరు

హుడాకాంప్లెక్స్: చిన్నపాటి వర్షాలకే లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఏటా అవే సమస్యలు ఉత్పన్నం అవుతున్నా.. సంబంధిత అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సరూర్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీలకు వరద ముంచెత్తుతోంది. ఇప్పటికే ఉన్న భూగర్భ డ్రైనేజీ లైన్ల నిండా వ్యర్థాలు పేరుకు పోవడం, ఏళ్ల తరబడి వాటిని తొలగించకపోవడంతో చిన్న పాటి వర్షాలకు అవి పొంగి ప్రవహిస్తున్నాయి. వరదకు తోడు వీధుల్లోని మ్యాన్‌హోళ్ల నోర్లు తెరచి.. ఆందోళన కలిగిస్తున్నాయి.

అసంపూర్తిగా ట్రంక్‌లైన్ పనులు

ఎల్బీనగర్, స్టేడియం వెనుక వైపు నుంచి వచ్చే వరద కొత్తపేట, బాపునగర్, జేబీ కాలనీ, విజయపురి కాలనీ, వేంకటేశ్వర కాలనీలను ముంచెత్తుతోంది. వరదల నియంత్రణ కోసం రెండేళ్ల క్రితం రూ.6 కోట్లతో చేపట్టిన ట్రంక్‌లైన్ పనులు నేటికీ పూర్తి కాలేదు. కేవలం 25 శాతమే పూర్తి చేశారు. మిగిలిన వాటిని అలాగే వదిలేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇళ్ల మధ్య మురుగు నీరు నిల్వ పేరుకుపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలకు నిలయంగా మారింది. రాత్రి పూట కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ఇళ్లలోకి వరద

ఏకధాటి వర్షాలతో ఇళ్లల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. విజయపురి కాలనీని ముంచేత్తుతుండడంతో స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. నిత్యవసరాలతో పాటు విలువైన



కాలనీలను ముంచెత్తిన వరద

ఇతర వస్తువులన్నీ తడిసి ముద్దయి నష్టపోతున్నారు. రెండు రోజుల క్రితం బాపునగర్ శివాలయంలోకి వరద చేరింది. వేంకటేశ్వర కాలనీ రోడ్ నంబర్ 17లోని ఇళ్లను వరద ముంచెత్తింది. జేబీకాలనీకి ఇదే పరిస్థితి.

ముప్పును తప్పించాలి



ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద కాలనీలను ముంచెత్తుతోంది. ఏటా ఇదే తంతు కొనసాగుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా ఆశించిన ఫలితం ఉండటం లేదు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. కానీ.. శాశ్వత పరిష్కార మార్గం చూపించడం లేదు. తరచూ స్థానికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– ధనంరెడ్డి, వేంకటేశ్వరకాలనీ, అధ్యక్షుడు

తక్షణమే చర్యలు తీసుకోవాలి



డ్రైనేజీల్లో పేరుకు పోయిన చెత్తను, ఇతర వ్యర్థాలను తొలగించాలి. దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లను పునరుద్ధరించాలి. మధ్యలో నిలిచిపోయిన బాక్స్‌లైన్ పనులను వెంటనే పూర్తి చేయాలి. ఇందుకు అవసరమైన నిధులను వెంటనే కేటాయించాలి. అధికారులు స్పందించి, తక్షణ చర్యలు చేపట్టాలి.

– ఆకుల శ్రీవాణి, కార్పొరేటర్, సరూర్‌నగర్

ఘనంగా హర్‌ఘర్ తిరంగా వేడుకలు

బడంగ్‌పేట్: 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా భారత ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. యువతరంలో దేశ భక్తిని పెంపొందించడమే హర్‌ఘర్ ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశ ఔనత్యాన్ని చాటి చెప్పేలా నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో డీపీఎస్ సీఈఓ మల్క



తిరంగా వేడుకల్లో పాల్గొన్న నాయకులు

యశస్వి, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, ప్రిన్సిపాల్ డా.అనుపమ సక్సేనా, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



సింధు (ఫైల్)

చాదర్‌ఘాట్: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారి తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి రెడ్‌హిల్స్‌లో నివసిస్తున్న సింధు సూర్యాన్ (45) ద్విచక్ర వాహనంపై మలక్‌పేట పల్టన్ వైపు వెళ్తున్నది. మలక్‌పేట ఫ్లైఓవర్ వద్ద అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు బస్సు డ్రైవర్ వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు ..

హస్తినాపురం: టిప్పర్‌ను ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ రాఘవేంద్రకాలనీకి చెందిన సూదుల వెంకటఅరుణ్ (35), దంతూరి అజయ్ బైక్‌పై హయత్‌నగ్ నుంచి ఎల్‌బీనగర్ వైపు వెళ్తున్నారు. హైకోర్టు కాలనీదగ్గర ముందు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేయగా వారు అదుపుతప్పి టిప్పర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అరుణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అజయ్ తీవ్రంగా గాయపడడంతో చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాలల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి సూచించారు. వరదల నేపథ్యంలో జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం ఆమె అధికారులు, మాజీ పాలకమండలి సభ్యులతో సమీక్ష నిర్వహించారు. పెద్దఎత్తున మురికివాడలు, ముంపు ప్రాంతాలు కలిగిన ఈ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ కొనసాగించాలన్నారు. ఎప్పటికప్పుడూ ఫాగింగ్ చేపడుతూ, వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. జల్‌పల్లి పెద్దచెరువు, ఉస్మాన్‌నగర్‌లోని బుర్హాన్‌ఖాన్ చెరువు పరిసరాల ప్రజలను ఎప్పటికప్పుడూ అప్రమత్తం చేయాలని సూచించారు. గతంలో కంటే మౌలిక సదుపాయాలు మెరుగు పడ్డాయని, డ్రైనేజీ పైప్‌లైన్‌లలోకి వర్షపునీరు వెళ్తుండడంతో మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయన్నారు. గల్ఫర్ మిషన్‌తో ఎప్పటికప్పుడూ శుభ్రం చేయాలన్నారు. అవసరం మేరకు మరో గల్ఫర్ మిషన్, పారిశుద్ధ్య కార్మికులను కూడా సమకూర్చుకోవాలన్నారు. ముఖ్యంగా వార్డు ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ పరిస్థితులను సమీక్షించుకోవాలన్నారు. నబీల్ కాలనీలో ఎస్ఎన్‌డీపీ పనులు తుది దశకు చేరుకున్నాయని, అక్కడక్కడ నెలకొన్న రోడ్ల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలోని కమిషనర్లు అందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, మాజీ చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, షేక్ అఫ్జల్, పల్లపు శంకర్, యాహ్యా, యంజాల అర్జున్, హుస్సేన్, కాట్రగడ్డ వాసుబాబు, గుండు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో సంఘం నాయకులు

నాగోలు: నాగోలు గ్రామంలోని అంబేడ్కర్ భవనం కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి నిధులు మంజారు చేయాలని కోరుతూ నాగోలు తెలంగాణ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు దప్పు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నిధుల నుంచి నిర్మాణంతో పాటు కమ్యూనిటీ హాల్‌కు జిమ్ సామన్లు ఇప్పిస్తానని హామీనిచ్చారు. గ్రామ పెద్దలు దప్పు పోచయ్య, దప్పు విజయ్, దప్పు సాయిరాం, పిల్లయిపల్లి నర్సింహ, రాజేశ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ రేస్ క్లబ్ చైర్మన్‌గా ఆర్.సురేందర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: హెచ్‌ఆర్‌సీలో బుధవారం నిర్వహించిన 54వ వార్షిక జనరల్ సమావేశంలో హైదరాబాద్ రేస్ క్లబ్ చైర్మన్‌గా ఆర్.సురేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని హెచ్‌ఆర్‌సీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా రేస్ క్లబ్ డైరెక్టర్లుగా ఎస్‌వీఆర్ నర్సింహారెడ్డి, ఎంవీ కృష్ణదాస్, ఎస్‌బీ నాయర్, ఆర్.రాజేశ్ ఎన్నికయ్యారని ఆయన పేర్కొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా బైక్ ర్యాలీ



ర్యాలీలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, బీజేపీ నాయకులు

వనస్థలిపురం: 'హర్ ఘర్ తిరంగా' లో భాగంగా రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో నాగోల్ నుంచి వనస్థలిపురం వరకు బుధవారం తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన సభలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతలో దేశభక్తి భావాన్ని నింపడం, జాతీయ ఐక్యతను బలపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు చింతల అరుణ, క్లిం నవజీవన్ రెడ్డి, బద్ధం ప్రేమమహేశ్వర్‌రెడ్డి, నాయకోటి పవన్ కుమార్, మొద్దు లచ్చిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు క్లిం రవీందర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, హరీశ్ రెడ్డి, శ్రీకాంత్, క్రాంతికుమార్‌గౌడ్, విష్ణువర్ధన్ రావు, జయప్రకాశ్, మల్లేశ్‌గౌడ్, కిరణ్‌కుమార్, నవీన్‌యాదవ్, మహిళా మోర్చా, యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

నాగోలు బీజేవైఎం ఆధ్వర్యంలో..

నాగోలు: నాగోలు బీజేవైఎం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా'లో భాగంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలిసి బుధవారం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అలాగే నాగోలు డివిజన్‌లో తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో..

మలక్‌పేట: భాగ్యనగర్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ కమలా హాస్పిటల్ నుంచి మూసారంబాగ్ టీ-జంక్షన్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మీమధుసూదన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాశ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, మాజీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి, యువ మోర్చ అధ్యక్షుడు భరత్ హాజరయ్యారు. కార్యక్రమంలో మలక్‌పేట కన్వీనర్ గజానంద్, సురేందర్, దినేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

శిథిల భవనాలను తొలగించండి

మున్సిపల్ కమిషనర్ వాణి

మీర్‌పేట: భారీ వర్షాల నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేశామని కమిషనర్ వాణి తెలిపారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ మున్సిపల్ సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో పర్యటించి శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి తొలగించాలని పట్టణ ప్రణాళిక సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాలనీలు, బస్తీల్లో ఎక్కడ కూడా నీరు నిల్వకుండా, చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడూ తొలగించాలని శానిటేషన్ సిబ్బందికి కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఏఎంసీ సంరెడ్డి నాగేందర్‌రెడ్డి, డీఈ వేణుగోపాల్, శానిటేషన్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్పొరేషన్ సిబ్బందితో మాట్లాడుతూ కమిషనర్ వాణి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

బడంగ్‌పేట్: అధికారులు అప్రమత్తంగా ఉండి, ధన, ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి కోరారు. బుధవారం కార్పొరేషన్‌లోని సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వారికి తగు సూచనలు చేశారు. వర్షాలతో పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో ఉద్యోగులు వెళ్లి పరిస్థితులు ఎప్పటికప్పుడూ పరిశీలించాలని కోరారు. పట్టణ ప్రణాళిక సిబ్బంది ప్రతి డివిజన్‌లో పర్యవేక్షించి శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వార్డులో నీటి నిలువ ఉన్న ప్రాంతాలను గుర్తించి సాఫీగా వరద నీరు వెళ్లేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడూ డ్రైనేజీ, పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలని సూచించారు. వరదలకు డ్రైనేజీలు పొంగుతుంటాయిని వాటిని గుర్తించి ఎప్పటికప్పుడూ శుభ్రం చేయించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ జాన్ కృపాకర్, డీఈఈ వెంకన్న, మెప్మా శంకర్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: అధికారులతో మట్లాడుతున్న కమిషనర్ సరస్వతి

చెరువులు, కుంటలకు జలకళ



కందుకూరు: అలుగు పారుతున్న జైత్వారంలోని నాయనివాని చెరువు



తుక్కుగూడ: మంఖాల్ నుంచి రావిర్యాల చెరువులోకి వస్తున్న వరదనీరు

కందుకూరు: మండల పరిధిలో బుధవారం ఉదయం నుంచి ముసురు వర్షం కురిసింది. దీంతో వ్యవసాయం చేసుకోవడానికి వెళ్లే రైతులు, కూలీలు, బయట పనులపై వెళ్లే సాధారణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా జైత్వారం నాయనివాని చెరువు నిండి అలుగు పారుతోంది. అలుగు పారుతుండటంతో అటువైపు పొలాలకు వెళ్లే రైతులు అవస్థలు పడ్డారు. పులిమామిడిలోని సొడవుకుంట నిండి అలుగు పారుతోంది. కొత్తగూడ సున్నం చెరువులోకి గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సగానికిపైగానే నీరు వచ్చి చేరింది.

రోడ్లు జలమయం

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపల్ వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి శ్రీశైలం జాతీయ రహదారితో పాటు పలు గ్రామాల రోడ్లు, వీధులు పూర్తిగా జలమయంగా మారాయి. భాగ్ మంఖాల్ చెరువు నుంచి పులిందర్ వాగు ద్వారా రావిర్యాల చెరువులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో రావిర్యాల చెరువు నిండుకుండలాగా మారింది. ఈ వర్షానికి రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న యాంటీ డ్రగ్ కమిటీ సభ్యులు, కళాశాల సిబ్బంది

మత్తు.. జీవితాలు చిత్తు

ప్రిన్సిపాల్ డా.రమేశ్


మహేశ్వరం: యువత డ్రగ్స్, గంజాయి బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సంగి రమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి వాడకంతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. రోగ నిరోధక వ్యవస్థ బాగా దెబ్బతింటుందన్నారు. సమాజంలో గౌరవ మర్యాదలు కోల్పోతారని తెలిపారు. డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణానికి అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. డ్రగ్స్, గంజాయి ఎవరూ అమ్మినా, కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్, గంజాయి వాడకానికి వ్యతిరేకంగా విద్యార్థులు మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ హెడ్ డా.జాహేదాబేగం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.చందన, అధ్యాపకులు ఇంతియాసుద్దీన్ ఫారూఖీ, ఉపేంద్ర, గోపాల్, చిన్నోజీ, శ్రీదేవి, కుమార్, రమేశ్, సన్నీ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

లింగోజిగూడ: ఏకధాటిగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. వివిధ శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించి డివిజన్ పరిధిలో ముంపు ప్రాంతాలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలాలు, డ్రైనేజీల్లో వరద నీరు సాఫీగా వెళ్లేలా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ మల్లికార్జున్ రావు, ఈఈ కార్తీక్, డీఈ రవిచందు, ఏఎంహెచ్‌ఓ నగేశ్ నాయక్, ఏఈ కీర్తిరెడ్డి, జలమండలి డీజీఎం సన్యాసి రావు, మేనేజర్ పవిత్ర, ట్రాఫిక్ ఎస్ఐ మల్లారెడ్డి, సరూర్‌నగర్ ఎస్ఐ లక్ష్మణ్, నాయకులు శ్రీధర్‌గౌడ్, రోహిత్, శ్రీనాథ్, ప్రవీణ్, నరేందర్, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నాగోలు: వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. కొత్తపేట డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలైన న్యూ సమతాపురి కాలనీ, గాయత్రీపురం, ఎస్ఆర్‌ఎల్ కాలనీ, నాగేశ్వరరావు కాలనీ, బృందావన్ కాలనీల్లో బుధవారం పర్యటించారు. ప్రతిక్షణం జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు వాళ్ల సిబ్బందిని అప్రపత్తంగా ఉంచాలని సూచించారు. న్యూ సమతాపురి కాలనీలో స్ట్రాం వాటర్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ షరీఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు హైడ్రా సిబ్బంది, ఎస్ఆర్‌ఎల్ కాలనీ సభ్యులు, న్యూ సమతాపురి కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు